
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 25.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 20 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.70 (311.1486)	37,116	38,440
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.89 (4.17)	359.14	628.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.47 (44.94)	నిల్	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

గుట్ట పనుల్లో కదలిక

- అసంపూర్తి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- మూడు నెలల్లో మొదటిఘాట్ రోడ్డు బ్రిడ్జి పనులు పూర్తి
- విమానగోపురానికి స్వర్ణతాపడం షురూ
- శిల్పారామం, అన్నదాన సత్రం అభివృద్ధికి నిధులు



ఆలయ ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్



గుట్టలో కొండ కింద అసంపూర్తిగా ఉన్న అన్నదానసత్రం

యాదాద్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో చేపట్టే అభివృద్ధి పనులు ఆలయాల ప్రాశస్త్యం, క్షేత్ర విశిష్టతకు భంగం కలగకుండా, చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా చేపట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు ఆలయాల అభివృద్ధి పనులతోపాటు భక్తుల సౌకర్యాలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవాదాయ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, ఉద్యాన, తదితర శాఖల సమన్వయంతో ఆలయ ప్రాంగణాల్లో వసతులతోపాటు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. స్వామివారి ప్రధాన ఆలయంలోని గర్భగుడి విమానగోపురానికి స్వర్ణతాపడం పనులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు వెంటనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు 60కిలోల బంగారంతో స్వర్ణతాపడం పనులు ప్రారంభించనున్నారు. యాదగిరిగుట్టలో పూజా కార్యక్రమాలకు పూలు, తులసి వంటి పత్రాలను బయట నుంచి కొనుగోలు చేయకుండా దేవాలయ భూముల్లోనే వాటిని పెంచేలా చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం ఉద్యాన శాఖ అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

కొండ కింద చేపట్టాల్సిన పనులు

దేవాలయం కొండకింద చేపట్టాల్సిన పలు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణం బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతోనే అనే విషయం స్పష్టమైంది. సంవత్సరకాలంగా యాదగిరిగుట్ట టెంపుల్ డెవెలప్‌మెంట్ అథారిటీ(వైటీడీఏ) ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇండియాలోనే రెండో అతిపెద్ద పొడవైన లింక్ బ్రిడ్జి నిర్మాణ పనులు గుట్టలో చేపడుతుండగా, ఆ పనులు నిలిచిపోయాయి. ఈ పనులు మూడు నెలల్లోగా పూర్తి చేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశాలు జారీచేశారు. రోడ్ల సుందరీకరణ పనులతోపాటు ఆలయానికి ఉత్తర భాగంలోని ప్రెసిడెన్షియల్ సూట్ వైపుగల రెండోఘాట్ రోడ్డుకు కలిపే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసింది. ఈ ఫ్లైఓవర్ ద్వారానే భక్తులు కొండపైకి వెళ్తున్నారు. వాస్తవానికి తులసీ కాటేజ్ నుంచి ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ నుంచి కొండపైకి వెళ్లి, రెండో ఘాట్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ మీదుగా కిందకి వెళ్లాలి. ఆలయానికి విచ్చేసే ప్రధాన రహదారి నుంచి మొదట ఘాట్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.34కోట్లతో నిర్మించతలపెట్టిన ఈ ఫ్లైఓవర్ పనులు కొవిడ్-19 ప్రారంభమైన నాటినుంచి నత్తనడకన సాగుతున్నాయి. యాదగిరిగుట్ట దేవస్థానానికి రాకపోకల నిమిత్తం ఎగ్జిట్ ఫ్లైఓవర్ (ఉత్తర భాగంలో నిర్మించిన ఫ్లైఓవర్) పేసే ఆధారపడిన భక్తులకు... ప్రభుత్వ నిర్ణయంతో నెట్‌వర్క్ ఆర్క్ బ్రిడ్జి (ఎంట్రీ ఫ్లైఓవర్)తో గొప్ప ఉపశమనం లభించనుంది. మెకలై స్టీల్‌తో నిర్మించనున్న 64 మీటర్ల ఫ్లైఓవర్‌ను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో భక్తులకు తిప్పలు తప్పనున్నాయి.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

కొండ కింద స్వామివారి చెంతకు వచ్చే భక్తుల కోసం అత్యాధునికంగా అన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. భవనం పనులు పూర్తికాగా భక్తులు భోజనాలు చేసేందుకు అరకొరగా సౌకర్యాలు ఉన్నాయి. దీంతో భక్తులు నేలపైన కూర్చొని అన్నదాన ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. రూ.కోటి నిధులు కేటాయిస్తే అన్నదాన సత్రం పనులు పూర్తి కానున్నాయి. ఈ భవనం అందుబాటులోకి వస్తే వందలాది మంది భక్తులు అన్నదాన ప్రసాదాలు స్వీకరించే అవకాశాలున్నాయి. పెద్దగుట్టపై దాదాపు రూ.2కోట్లతో వైటీడీఏ అతిథి గృహాన్ని నిర్మించింది. ఈ భవనాన్ని నిర్మించి రెండేళ్లు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచలేదు. వైటీడీఏ మరో అతిథిగృహాన్ని ఎందుకు నిర్మించిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాయిగిరి చెరువు వద్ద ఏర్పాటుచేసిన శిల్పారామం పనులు తుది దశలో నిలిచిపోయాయి. ఈపనులు పూర్తయితే గుట్టకు వచ్చే భక్తులకు శిల్పారామం ఆహ్లాదకరంగా మారనుంది.కంచి కామకోటి పీఠంఆధ్వర్యంలో రాయిగిరిలో 20ఎకరాల్లో రూ.43కోట్లతో వేదపాఠశాలను నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.



సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ఆశలు

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గ పరిశీలనకు వస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- అక్కడే ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష
- అన్ని వివరాలతో సిద్ధమైన ఇరిగేషన్ అధికారులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరందించే కీలక ప్రాజెక్టులను రానున్న రెండేళ్లలో పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. గత సంప్రదాయాలకు భిన్నంగా క్షేత్రస్థాయికి వెళ్లి పనులు జరిగే ప్రదేశాల వద్దనే ఉన్నతాధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమీక్షలు నిర్వహిస్తూ పనుల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మినీ ఎత్తిపోతల పథకాల పనుల ప్రగతిపై ఇటీవల భారీనీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా పనుల ప్రదేశాలను సందర్శించి సమీక్షలు నిర్వహించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

తాజాగా, జిల్లాలోని భారీ ప్రాజెక్టుల పురోగతిపై ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం అవుట్‌లెట్ (మన్నెవారిపల్లి) వద్ద శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో పాల్గొనేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు రానుండటంతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కీలక నిర్ణయాలుండే అవకాశం ఉంది.

ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తికి ప్రత్యేక కార్యాచరణ

ఉమ్మడి జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారమార్గం, సాగునీటి కోసం చేపట్టిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనుల పూర్తిపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ పథకంలో కీలకమైన టన్నెల్ తవ్వకాన్ని శ్రీశైలం రిజర్వాయర్ వైపు నుంచి మన్నెవారిపల్లి వరకు చేపట్టారు. 10మీటర్ల డయాతో మొత్తం 43.930 కిలోమీటర్లు రెండువైపులా సొరంగం పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు 34.370 కిలోమీటర్లు పూర్తయింది. ఇంకా కేవలం 9.560 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. అవుట్‌లెట్-1లో మరమ్మతుకు గురైన టన్నెల్ బోరింగ్ మిషన్‌లో వినియోగించే 37 మెట్రిక్‌టన్నుల బేరింగ్‌ను అమెరికాలో తయారు చేసే రాబిన్‌సన్ కంపెనీకి ఇటీవలే ఆర్డర్ ఇచ్చారు. ఈ కంపెనీని గతనెలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి బేరింగ్‌ను త్వరితగతిన ఏజెన్సీకి అప్పగించాలని సూచించారు. బేరింగ్, ఇతర పరికరాలు నవంబరులోపు వస్తాయని, వచ్చిన వెంటనే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఇటీవల మంత్రులు నిర్ణయించారు. ఇన్‌లెట్ వైపు నుంచి చేపట్టిన సొరంగం పనులు ముందుకుసాగకుండా 2019 నుంచి ఊటనీరు వచ్చిచేరుతోంది. దీంతోపాటు పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో పనులు ముందుకు సాగడంలేదు. ఊటనీటిని తోడివేస్తూ, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయిస్తున్నారు. వీటిని నవంబరు నాటికి పూర్తిచేసి మిగిలిన పనులను కూడా నిర్దేశిత సమయానికి పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సొరంగమార్గంలో రెండు టన్నెళ్ల నడుమ డిండి నదిపై తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మిస్తున్న నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)తో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దానికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ అవల నేరేడుగొమ్ము మండలంలో 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ రంగం సిద్ధం చేశారు.

డిండి ఎత్తిపోతల పనుల వేగవంతమయ్యేనా?

దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల పరిధిలోని 3.41లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే లక్ష్యంతో 2015లో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాజెక్టుకు కీలకమైన నీటి సేకరణ ఎక్కడనే అంశంపై సందిగ్ధం ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి రోజుకు అర టీఎంసీ చొప్పున వరద రోజుల్లో 60 రోజుల్లో 30టీఎంసీల నీటిని సేకరించాలని నిర్ణయించారు. ఉల్పర వద్ద దుందుభి నది (డిండి నది)పై బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి కాల్వ ద్వారా నేరుగా శివన్నగూడెం వరకు 66.300కి.మీ ప్రధాన కాల్వకు డిజైన్ చేశారు. అయితే ఉల్పర వరకు శ్రీశైలం నీటిని ఎలా తరలించాలనే అంశంపై స్పష్టత లేదు. గత ప్రభుత్వం ఆలోచన ప్రకారం, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి డిండి లిఫ్టుకు నేరుగా కాకుండా, పాలమూరు-రంగారెడ్డి పథకంతో కలిపి తీసుకోవాలని నిర్ణయించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 60 రోజుల్లో 90టీఎంసీలు, డిండికి 30టీఎంసీలు కలిపి రోజుకు 2టీఎంసీల చొప్పున 120టీఎంసీల నీటిని సేకరించేలా పాలమూరు ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ వద్ద పంపులు, మోటార్లు డిజైన్ చేశారు. ఏదుల రిజర్వాయర్, లేదంటే వట్టెం రిజర్వాయర్ల నుంచి ఉల్పరలో ప్రతిపాదిస్తున్న బ్యారేజీ వరకు కృష్ణాజలాలను తరలించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ఇది ప్రతిపాదనకే పరిమితమవడం, పాలమూరు ప్రాజెక్టు నీటిని డిండికి ఎట్టిపరిస్థితుల్లో తరలించవద్దనే పాలమూరు ప్రజాసంఘాలు, రాజకీయనేతల ఒత్తిళ్ల నేపథ్యంలో గత ప్రభుత్వం ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా డిండి దిగువన ఉన్న రిజర్వాయర్ల, కాల్వల పనులు చేపట్టింది.

ప్రభుత్వం తేల్చితేనే ముందడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కీలక పనులను ఎక్కడ చేపడతారో తేల్చి, రిజర్వాయర్ల పనులతో సమాంతరంగా నిర్వహిస్తేనే ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 66.300 కిలోమీటర్ల ప్రధాన కాల్వతో పాటు, సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్మాణాలు, డిండి ప్రాజెక్టు ఎత్తుపెంపు. ఉల్పర బ్యారేజీ సహా ఎర్రవల్లి-గోకారం, కిష్టరాంపల్లి, శివన్నగూడెం ఆన్‌లైన్ రిజర్వాయర్ల పనులు చేపట్టారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆమనగల్లు మండలంలో ఇర్విన్ వద్ద ప్రతిపాదించిన మరో ఆన్‌లైన్ రిజర్వాయర్‌ను ప్రజలు వ్యతిరేకించడంతో వాటిని నిలిపిపేశారు. ప్రధాన కాల్వతో పాటు, అన్ని రిజర్వాయర్లకు కలిపి ఇర్విన్ మినహాయిస్తే 15,031.06 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 8841.01 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 6188.95 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ భూమితో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా నిర్వాసితులకు, నల్లగొండ జిల్లాలో కిష్టరాయన్‌పల్లిలో నిర్వాసితులకు, నాంపల్లి మండలం లక్ష్మణపురం, చింతపల్లి మండలం ఈదులగూడెం గ్రామస్థులకు, శివన్నగూడెం రిజర్వాయర్‌తో నిర్వాసితులయ్యే చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లితండా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. ఇప్పటివరకు ప్యాకేజీలు కుదరకపోవడంతో సదరు నిర్వాసితులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాల్సి ఉంది.

భూసేకరణ, పునరావాసమే కీలకం

అవి పూర్తయితేనే ప్రాజెక్టు పనులు ముందుకు •7లో..

డిప్యూటీ సీఎం భట్టి పర్యటన ఇలా..

దేవరకొండ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ నెల 20న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనుల పరిశీలనకు రానున్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి నల్లగొండ, నాగర్ కర్నూల్ జిల్లా సరిహద్దులోని ఎస్ఎల్‌బీసీ శ్రీశైలం సొరంగ మార్గం టన్నెల్-1 వద్దకు 9.40గంటలకు చేరుకుంటారు. 10.30గంటలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి నేరుగా టన్నెల్-1 ఎస్ఎల్‌బీసీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. 12.30 నుంచి 1.45గంటల వరకు నీటిపారుదలశాఖ, జెన్‌కో, ఎలక్ట్రిసిటీ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.50 నుంచి 2.20 గంటల వరకు భోజన విరామంలో పాల్గొంటారు. 2.30గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే బాలునాయక్



ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిని సమీక్షించేందుకు రానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంత్రుల పర్యటన ఏర్పాట్లను గురువారం పరిశీలించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగం, నక్కలగం డి, పెండ్లిపాకల, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాల నర్సింహారెడ్డి, వెంకటయ్యగౌడ్, సిరాజ్‌ఖాన్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ బిల్లులు వచ్చేశాయ్

ఉమ్మడి జిల్లాకు రూ.4.84కోట్లు విడుదల
ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతుల వరకు బిల్లులు
పెండింగ్‌లోనే 9, 10వ తరగతుల బిల్లులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతుల మధ్యాహ్న భోజనం, కోడిగుడ్ల పెండింగ్ బిల్లులు రూ.4,84,12,053 విడుదలయ్యాయి. ఈ మొత్తంలో భోజనం, కార్మికులు, ఆపరేటర్ల వేతనాల బిల్లు రూ.3,40,47,153 ఉండగా, కోడిగుడ్ల బిల్లు 1,43,64,900 ఉం ది. దీంతో కార్మికులు, ఆపరేట్లకు ఆర్థిక సాంత్వన లభించనుంది. ఆగస్టు వరకు విడుదలైన బిల్లులు త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాల్లో జమకానున్నాయి.

- భువనగిరి టౌన్ •7లో..

త్వరలో ఖిల్లా పనులు ప్రారంభిస్తాం

పర్యాటకశాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి



ఖిల్లా అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న పర్యాటకశాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన భువనగిరి ఖిల్లాపై ప్రతిపాదించిన అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గురువారం భువనగిరి ఖిల్లాను ఆయన సందర్శించి చేపట్టనున్న పనులను పరిశీలించారు. డీపీఆర్ అలైన్‌మెంట్ వచ్చాక స్వల్ప మార్పులతో మరోమారు సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వే నివేదిక ఆధారంగా రెవెన్యూ అధికారులతో చర్చించి పరిహారం చెల్లింపుపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం పనుల వాస్తవ పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌తో సమావేశమై ఖిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. అలాగే బస్వాపూర్ రిజర్వాయర్ సమీపంలోని 93 ఎకరాల పర్యాటక స్థలాన్ని కూడా ఆయన పరిశీలించారు. అయితే కోల్‌కత్తాకు చెందిన రోప్‌వే ఎక్స్‌పర్ట్ వెంకటేష్ నేతృత్వంలో రోప్‌వే అలైన్‌మెంట్‌కు మార్కింగ్ చేశారు. తుది డీపీఆర్ ఆధారంగా రోప్‌వే మార్కింగ్‌ను మరోమారు పరిశీలించి రూ.86కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు టెండర్లు పిలిచే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన వెంట ఆర్డీవో అమరేందర్, పర్యాటకశాఖ జీఎం ఎం.ఉపేందర్‌రెడ్డి, భువగిరి ఖిల్లా ప్రాజెక్ట్ ఎల్‌అండ్‌టీ టీంమేనేజర్ సుమతి, జిల్లా పర్యాటకశాఖ అధికారి కె.ధనాంజనేయులు, ఆర్‌ఐ భద్రయ్య, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బొమ్మలరామారం, సెప్టెంబరు19: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, మందుల స్టాక్ వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అందుకోసం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ సుమలతకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో రైతు రుణమాఫీ వివరాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివరాలు అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఆరు మాసాల్లో రూ.18వేల కోట్ల రుణమాఫీ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

మోత్కూరు, సెప్టెంబరు 19: మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పదేళ్లలో ఒక లక్ష రుణమాఫీ చేయలేకపోయాడని, సీఎం రేవంత్‌రెడ్డి ఆరు మాసాల్లో రైతులకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.మోత్కూరు రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.65లక్షల వ్యయంతో నిర్మించిన వాణిజ్య సముదాయం,గోదాంను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి గురువారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాల్లో బడుగు, బలహీన వర్గాల రైతులే ఉంటారని, వారికి అవసరమైనన్ని రుణాలు సంఘాలు అందించాలన్నారు. రైతులు కూడా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘం బలోపేతానికి పాటుపడాలన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సాగునీటి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బునాదిగాని (ధర్మారం) కాల్వ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.269 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. మోత్కూరులో డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్‌డిపో, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు, బిక్కేరు వాగుపై నూతన బిడ్జి నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ నుంచి మోత్కూరు సింగిల్‌విండోకు రూ.1కోటి, అడ్డగూడూరు సింగిల్‌విండోకు రూ.1.50కోట్లు మంజూరు చేయాలని కోరగా, ఆ మేరకు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

త్వరలో ఎన్ఎల్ఎస్ఎం రుణాలు : డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సహకార బ్యాంకు నుంచి త్వరలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎస్ఎం) రుణాలు ఇస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీటి ద్వారా గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు పెంచే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 50శాతం సబ్సిడీ వస్తుందన్నారు. 10 ఎకరాలు ఉన్న రైతులకు రూ.కోటి రుణం ఇస్తామన్నారు. ఈ నెల 27న జరగనున్న పాలకవర్గ సమావేశంలో ఎన్ఎల్ఎస్ఎం రుణాలపై ఆమోదం తీసుకుంటామన్నారు. ఆత్మకూరు(ఎం) మండలంలో వచ్చే నెలలో సహకార బ్యాంకును ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సహకార సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు డీసీసీబీ డైరెక్టర్లు గుడిపాటి సైదులు, ఉపేందర్‌రెడ్డి, అండెం సంజీవరెడ్డి, డీసీవో ఎన్.శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, తహసీల్దార్ డి.రాంప్రసాద్, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.








లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు























లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణంలో భాగంగా తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మ వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. 10వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా రూ.16,87,314 ఆదాయం ఆలయ ఖజానాకు సమకూరిందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్, పులిచింతల గేట్ల మూసివేత



మూసి వేసిన సాగర్ ప్రాజెక్ట్ గేట్లు

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, సెప్టెంబరు 19: నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లను గురువారం ఉదయం 10గంటలకు అధికారులు మూసివేశారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక రెండు నెలలుగా కొనసాగుతుండటంతో ఆగస్టు 5వ తేదీ నుంచి క్రస్ట్ గేట్లను ఎత్తి వరద రాకను బట్టి గేట్ల సంఖ్యను పెంచుతూ, తగ్గిస్తూ ప్రాజెక్టు అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. వరద రాక తగ్గడంతో ఈ నెల 11వ తేదీన అన్నీ గేట్లను మూసివేశారు. 13వ తేదీన రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు గత నాలుగు రోజులుగా రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగించారు. గురువారం ఎగవనుంచి వరద ప్రవాహం తగ్గటంతో రెండు గేట్లను మూసివేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు)కాగా గురువారం సాయంత్రానికి 589.70 అడుగులుగా(311.1486టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 37,116 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. కుడి కాల్వ ద్వారా 2,236 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,613 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,191 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తంగా 38,440 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల ప్రాజెక్టుకు నిలిచిన ప్రవాహం

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలిచిపోవటంతో అధికారులు క్రస్ట్‌గేట్లను మూసివేశారు. నాలుగు రోజులుగా వరద ప్రవాహం నిలకడగా కొనసాగడంతో రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు గురువారం ఉదయం వరద తగ్గడంతో గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 174.47అడుగులుగా(44.94 టీఎంసీలు) నమోదైంది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. 16వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఇన్‌ఫ్లో లేదు.

25లోగా సమాచారం అందించాలి

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను ఈ నెల 25వ తేదీలోగా డీవైఎస్ జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీవైఎస్‌వో సీహెచ్.విష్ణుమూర్తిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్‌కోసం తెలంగాణ క్రీడల పాలసీ ద్వారా మెడల్స్, ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల వివరాలను సేకరించి కావాల్సిన శిక్షణ, సహకారం అందించనుందని, పూర్తి వివరాలను అందజేయాలని కోరారు.

స్వచ్ఛ భారతమే సోపానం

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్రమోదీ స్వప్నమైన వికసిత భారత సాధనకు స్వచ్ఛ భారతమే ముఖ్య సోపానమని భారత ఆహార సంస్థ ఏజీఎం(క్యూసీ) డా.రాఘవేంద్రసింగ్ అన్నారు. స్వచ్ఛత యే సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం సంస్థ ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్రంలోని రామగిరిలోని సంస్థ జిల్లా కార్యాలయం నుంచి ఉద్యోగులు క్లాక్‌టవర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి జాతీయ గీతాలాపన చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు కేఎస్‌కే ప్రసాద్, రఘుపతి, బిల్ల శ్రీనివాసరావు, కేకే షా, జయకుమార్, పట్నాయక్, సుకుమార్, సెక్షన్ ఉద్యోగులు సతీష్‌రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించాలి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 19: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని డీ-40 కాల్వ ద్వారా చివరి భూములకు నీరందించి చెరువులను నింపాలని రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సీత్యాతండా, పుచ్చకాయలగూడెం, బొమ్మకల్ గ్రామాలకు డీ-40 నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. అధికారులు నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచి చివరి భూములకు నీరందించడంతో పాటు చెరువులను నింపాలన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతీవెంకటరెడ్డి, మధు, గణపతి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పుచ్చకాయలగూడెంలో డి-40 కాల్వకు నీరు రావడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

భూసేకరణ, పునరావాసమే.. కీలకం

బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో జిల్లాలోని ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా ప్రాజెక్టుల పెండింగ్ పనులపై దృష్టి సారించింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు సమీక్షలు నిర్వహించారు. అయితే నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లాకు రానుండడంతో ప్రాజెక్టుల ముందడుగుకు ప్రతిబంధకంగా మారిన భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసంపైనే ప్రధానంగా చర్చించనున్నారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో చందంపేట మండలంలోని నక్కలగండి తండా, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతున్నాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడు తండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండడంతో వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. నక్కలగండితండాకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించారు. ఇక్కడ ఆర్‌అండ్‌ఆర్ కేంద్రం నిర్మించాలని నిర్ణయించినా, ఇంకా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. అటు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాసకేంద్రాలను తొలుత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీలపై నిర్వాసితులతో చర్చించి తుదినిర్ణయం తీసుకుంటే తప్ప వారి సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. పునరావాస కల్పనపై ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి, మంత్రులు కీలక నిర్ణయం తీసుకుంటారని నిర్వాసితులు ఆశిస్తున్నారు.

బ్రాహ్మణవెల్లంలలో కాల్వల తవ్వకాలు పెండింగ్

ఎస్‌ఎల్‌బీసీలో అంతర్భాగంగా చేపట్టిన ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును డిసెంబరు నాటికి పూర్తిచేసి కాల్వలకు నీరివ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులో టన్నెల్, లిఫ్ట్, రిజర్వాయర్ నిర్మాణాలు పూర్తవగా, కాల్వల తవ్వకాలు పెండింగ్ ఉన్నాయి. యుద్ధప్రాతిపదికన కాల్వలకు భూసేకరణ చేపట్టి, కాల్వల నిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించింది. ఈ కాల్వలు పూర్తయి ఎత్తిపోతల పథకం ప్రారంభమైతే నల్లగొండ, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందనుంది. ఈ కాల్వల నిర్మాణానికి అవసరమైన సుమారు 2వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉండగా, ధర విషయంలో రైతులు సంతృప్తిగాలేకపోవడంతో భూసేకరణ ముందుకు సాగడంలేదు. తాజాగా జరిగే సమీక్షలో దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.



నెల్లికల్లు లిఫ్టు వేగంగా పూర్తిచేసేందుకు కార్యాచరణ

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశ్యంతో నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్ వద్ద చేపట్టిన నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను వేగంగా పూర్తిచేసేందుకు ఈ సమీక్ష ద్వారా సూచనలిస్తారని భావిస్తున్నారు. ఈ పథకం పూర్తిచేయడానికి ఇంజనీర్లతో, కాంట్రాక్ట్ ఏజెన్సీలతో ఇప్పటికే పూర్తిస్థాయిలో సమీక్షలు జరిపి కార్యాచరణ రూపొందించారు. ఈ పథకాన్ని రూ.539.910 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. పనులను వేగంగా పూర్తిచేసి వచ్చే సీజన్ నాటికి నీరందించేందుకు వీలుగా అధికారులకు ఈ సమీక్ష ద్వారా ఆదేశాలిస్తారని భావిస్తున్నారు.



మూసీకాల్వల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తారా..?

మూసీనదికి అనుసంధానమైన నిజాం కాలంలో నిర్మించిన బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వలను పునరుద్ధరించడం ద్వారా సుమారు 175 గొలుసుకట్టు చెరువులకు నీరందుతుంది. దీంతో అదనపు ఆయకట్టు కూడా అందుబాటులోకి రానుంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత కలిపి దాదాపు దాదాపు 60,863 ఎకరాలకు సాగునీరందనుంది. పరోక్షంగా బోరుబావుల ద్వారా దాదాపు ఇంతకు రెట్టింపు స్థాయిలో నీటివనరులు కలుగుతాయి. కీలకమైన ఈ కాల్వల పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.221కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టింది. వీటిలో బునాదిగాని కాల్వ ఆధునికీకరణలో మొత్తం 98.64 కిలోమీటర్లకు ఇంకా 55.56 కిలోమీటర్ల కాల్వ పనులు చేపట్టాల్సి ఉండగా, ఇందుకోసం అవసరమైన భూసేకరణ, పనుల నిమిత్తం 269.46 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు.

పిలాయిపల్లికి రూ.86.22 కోట్లు

పిలాయిపల్లి కాల్వకు సంబంధించి 66 కిలోమీటర్లకు 61.645 కిలోమీటర్లు పునరుద్ధరణ చేయాల్సి ఉండగా, ఇందుకోసం రూ.86.22కోట్ల నిధులు అవసరమవుతాయి. ధర్మారెడ్డిపల్లి కాల్వకు సంబంధించి 51.15 కిలోమీటర్లకు 29.72 కిలోమీటర్ల పనులు చేయాల్సి ఉండగా, ఇందుకోసం రూ.123.98 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. మొత్తం ఈ మూడు కాల్వలను పునరుద్ధరించేందుకు ఇంకా రూ.479.66 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు మంజూరు చేస్తే ఈ కాల్వల కింద ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో నీటి ఎద్దడి తీరుతుందని ఈ కాల్వల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నారు.

నిందితులను పట్టుకునేందుకు ఏడు బృందాలు

● ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్పీ

మేళ్లచెర్వు, సెప్టెంబరు 19: మండల పరిధిలోని వెల్లటూరు శివారులో గురువారం తెల్లవారుజామున దొంగతనానికి పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఈ చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపీలోని నందిగామకు చెందిన తమ్మిశెట్టి వెంకయ్య స్థానికంగా 15 ఏళ్లుగా ఇటుకబట్టీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో భార్యా భర్తలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజులు ధరించి ఐదుగురు దొంగలు కత్తులు తీసుకొని వచ్చారు. ఇంటి తలుపు పగలకొట్టి ఇంట్లో నిద్రిస్తున్న భార్యాభర్తలను కత్తులతో బెదిరించి ఇంట్లోని బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఘటనా స్థలానికి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తూ నిందితులను పట్టుకునేందుకు ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామని పోలీసులు తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐలు, పరమేష్, సైదిరెడ్డి ఉన్నారు.

లైంగిక దాడి ఘటనలో నిందితుడి అరెస్ట్

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 19: జిల్లాకేంద్రంలో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జిల్లాకేంద్రానికి చెందిన వృద్ధురాలిపై హిందూపూర్‌కు చెందిన కందుల కృష్ణ ఈ నెల 18వ తేదీన తెల్లవారుజామున శ్మశాన వాటిక సమీపంలో లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి విధితమే. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఘటనకు పాల్పడిన వ్యక్తి కందుల కృష్ణను గురువారం తన సిబ్బందితో కలిసి సాగర్ రోడ్డు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దామరచర్ల ఎఫ్‌ఎస్‌వో రాములు సస్పెన్షన్

● దిలావర్ ఫారెస్ట్ భూముల ఆక్రమణ అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే..

● సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చిన యాదాద్రి సర్కిల్ అటవీ కన్జర్వేటర్ శివానీ డొంగ్రే



ఎఫ్‌ఎస్‌వో రాములు

నల్లగొండ, దామరచర్ల, సెప్టెంబరు 19: నల్లగొండ జిల్లా దామరచర్ల ఎఫ్‌ఎస్‌వో (ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్) సీహెచ్. రాములుపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు యాదాద్రి సర్కిల్ అటవీ కన్జర్వేటర్ శివానీ డొంగ్రే గురువారం ఉత్తర్వులు విడుదలచేశారు. అటవీశాఖ దామరచర్ల సెక్షన్‌లోని దిలావర్‌పూర్ రిజర్వ్‌ఫారెస్ట్ బ్లాక్, కేజేఆర్ కాలనీ బీట్ పరిధిలో సుమారు 70 ఎకరాల వరకు అటవీ భూమి ఆక్రమణకు గురికాగా, దాన్ని నివారించడంలో, ఆక్రమణలను అడ్డుకోవడంలో అక్కడి సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాములు విఫలయ్యారనే నిర్ధారణకు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. అటవీభూముల ఆక్రమణను అడ్డుకునే క్రమంలో ఇటీవల అక్కడ అటవీ అధికారులు, సిబ్బందికి, ఆక్రమణదారులకు నడుమ గొడవ జరగడంతోపాటు కొట్లాట జరగ్గా, అటవీ సిబ్బందికి గాయాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఆక్రమణలు, ఘర్షణకు దారితీసిన పరిస్థితులపై మిర్యాలగూడ ఫారెస్ట్ రేంజ్ అధికారి, నల్లగొండ జిల్లా అటవీ అధికారి ద్వారా సమగ్ర విచారణ జరిపించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు దామరచర్ల సెక్షన్ ఆఫీసర్ రాములు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహించారనే విషయం నిగ్గుతేల్చారు. ఈ నివేదికల ఆదారంగా గురువారం రాములుని సస్పెండ్‌చేస్తూ కన్జర్వేటర్ శివానీడొంగ్రే ఉత్తర్వులివ్వడంతో అటవీశాఖ ఉద్యోగుల్లో కలకలం చెలరేగింది. ఈ ఆక్రమణలపై ఇంకా విచారణ కొనసాగుతూనే ఉందని, ఆక్రమణలకు పాల్పడ్డవారిపైనా, ఇందుకు సహకరించిన ఇతర అటవీ అధికారులు, ఉద్యోగులపైనా చర్యలు తప్పవనే చర్చ అటవీ శాఖ వర్గాల్లో సాగుతోంది.

విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మన్..

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణ విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్ లింగస్వామి సస్పెండైనట్లు ఆలస్యంగా తెలిసింది. ఇద్దరు గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ చార్జీల బిల్లుల నగదు డబ్బులు సుమారు రూ.13,000ను వసూలుచేసి సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. బకాయి ఉన్న సర్వీసుల ఇళ్లకు వెళ్లి వినియోగదారులను విద్యుత్ చార్జీ బిల్లు చెల్లింపుకోసం ప్రశ్నించగా వారు లింగస్వామికి నగదు చెల్లించామని చెప్పారు. దీంతో విద్యుత్ ఏఈ కే.చంద్రశేఖర్‌రావు విచారణ చేసి ఇచ్చిన నివేదిక మేరకు లింగస్వామిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ నల్లగొండ డీఈఈ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

నీటి గుంతలో పడి యువతి మృతి



స్వప్న మృతదేహం

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 19: దుస్తులు ఉతికే క్రమంలో ఫిట్స్ వచ్చి నీటి గుంతలో పడి యువతి మృతి చెందింది. ఈ ఘటన నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని పానగల్లుకు చెందిన అల్లి స్వప్న(18)కు ఫిట్స్ ఉంది. గత మూడు, నాలుగేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్న స్వప్న ఇంటర్ వరకూ చదివి అనారోగ్యం కారణంగా చదువు ఆపేసి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 18వ తేదీన ఆమె తల్లి రమణ కూలీ పనికి వెళ్లిన సమయంలో సాయంత్రం దుస్తులు ఉతికేందుకు నల్లా గుంత వద్దకు వచ్చింది. నీళ్లు చేదేందుకు ప్రయత్నించగా స్వప్నకు ఫిట్స్ వచ్చి గుంతలో పడిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి స్వప్న కన్పించకపోవడంతో అటు ఇటు వెతకగా, నల్లా గుంతలో పడి మృతి చెంది కన్పించింది. మృతురాలిని ప్రభుత్వాసుపత్రికి తరలించి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని స్వప్న తల్లి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

మధ్యాహ్న బిల్లులు వచ్చేశాయ్

● ఉమ్మడి జిల్లాకు రూ.4.84కోట్లు విడుదల ● ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతుల వరకు బిల్లులు



భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతుల మధ్యాహ్న భోజనం, కోడిగుడ్ల పెండింగ్ బిల్లులు రూ.4,84,12,053 విడుదలయ్యాయి. ఈ మొత్తంలో భోజనం, కార్మికులు, ఆపరేటర్ల వేతనాల బిల్లు రూ.3,40,47,153 ఉండగా, కోడిగుడ్ల బిల్లు 1,43,64,900 ఉంది. దీంతో కార్మికులు, ఆపరేట్లకు ఆర్థిక సాంత్వన లభించనుంది. ఆగస్టు వరకు విడుదలైన బిల్లులు త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాల్లో జమకానున్నాయి. అయితే 9, 10వ తరగతుల బిల్లులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు భోజనం బిల్లులో 60శాతం కేంద్రం 40శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. కోడిగుడ్ల బిల్లులను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. అలాగే కార్మికులకు చెల్లించే రూ.3వేల గౌరవ భృతిలో మాత్రం కేంద్ర ప్రభుత్వ వాటా రూ.600గా, ఉండగా మిగతా రూ.2400ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. త్వరలోనే 9, 10వ తరగతి బిల్లులు కూడా విడుదలవుతాయని సమాచారం.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,210 ప్రభుత్వ పాఠశాలల్లో 2,11,009 మంది విద్యార్థులు పని దినాల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. విద్యార్థుల హాజరు ఆధారంగా మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య రోజువారీగా మారుతుంది. ప్రభుత్వం పేర్కొన్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుంటాయి. భోజనం నాణ్యతను పరిశీలించాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే. మధ్యాహ్న భోజనంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన సౌకర్యాలు, విద్యా ప్రమాణాల కారణంగానే ప్రతి ఏటా చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధికారులు అంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 3,210 మధ్యాహ్న భోజనం ఏజెన్సీలున్నాయి. కానీ సకాలంలో ప్రభుత్వం బిల్లులు జారీ చేయకపోతుండడంతో ఏజెన్సీలు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతుండడంతోపాటు అప్పుడప్పుడు భోజనం నాణ్యతపై కూడా ప్రభావం చూపుతున్నట్లు ప్రచారంలో ఉంది. కాగా నల్లగొండ జిల్లా ఆపరేటర్లందరికీ పెండింగ్ వేతనాలు విడుదల కాగా సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా ఆపరేటర్ల వేతనాలు మాత్రం సాంకేతిక కారణాలతో నిలిచినట్లు, త్వరలోనే విడుదల కానున్నట్లు అధికారులు అంటున్నారు. ఏదేమైనా 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక రెండోసారి మధ్యాహ్నం భోజనం బిల్లులు విడుదల కావడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో 9, 10వ తరగతుల బిల్లులను కూడా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదే విధంగా స్కూల్ గ్రాంట్ నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ జిల్లాకు రూ.1.66కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.1.8కోట్లు, యదాద్రి భువనగిరి జిల్లాకు రూ.84.72లక్షలు విడుదలయ్యాయి.

జిల్లా	భోజనం బిల్లులు	గుడ్ల బిల్లులు
నల్లగొండ	రూ.2,17,68,034	రూ.30,32,000
యాదాద్రి	రూ.75,52,608	రూ.13,32,900
సూర్యాపేట	రూ.71,91,393	రూ.1,00,00,000
మొత్తం	రూ.3,40,47,153	రూ.1,43,64,900

ఆ ముగ్గురు విద్యార్థులు దొరికారు

● 48 గంటల్లో పట్టుకున్న నల్లగొండ జిల్లా పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

దేవరకొండ, సెప్టెంబరు 19: నల్లగొండ జిల్లా దేవరకొండ మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి పారిపోయిన ముగ్గురు విద్యార్థుల ఆచూకీని 48గంటల్లోనే పోలీసులు తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం దేవరకొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గిరిబాబు తెలిపారు. ఈ నెల 16వ తేదీన గురుకుల పాఠశాల ప్రహరీ అవతలి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కల్లు ప్యాకెట్లను విసిరేశారు. ముగ్గురు పదోతరగతి విద్యార్థులు వాటిని తీసుకోవడం గమనించిన సిబ్బంది, ఉపాధ్యాయులు వారిని ప్రశ్నించారు. దీంతో తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్‌కు తెలిస్తే మందలిస్తారనే భయంతో ఈ నెల 17న అల్పాహారం చేసిన అనంతరం ముగ్గురు విద్యార్థులు పాఠశాల గోడదూకి దేవరకొండ బస్టాండ్‌కు చేరుకున్నారు.

ఇబ్రహీంపట్నంలో దిగి.. చికెన్ దుకాణంలో పనిచేసి

హైదరాబాద్ బస్సు ఎక్కిన ముగ్గురు విద్యార్థులు సంతోష్‌నగర్‌కు టికెట్ ఇవ్వాలని కండక్టర్‌ను అడిగారు. వారి వద్ద ఉన్న నగదు హైదరాబాద్‌కు సరిపడాలేకపోవడంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు టిక్కెట్ తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో దిగిన విద్యార్థులు అక్కడే రాత్రి బసచేశారు. తండ్రి నిర్వహించే చికెన్ దుకాణంలో చేదోడువాదోడుగా ఉండటం తెలిసిన ఓ విద్యార్థి ఇబ్రహీంపట్నంలో ఈ నెల 18న చికెన్ షాపులో పనికి కుదిరాడు. ఆ రోజు యజమాని ఇచ్చిన రూ.200 తీసుకుని మిత్రులతో కలిసి హైదరాబాద్ చార్మినార్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. 18వ తేదీ రాత్రి ఇబ్రహీంపట్నం రోడ్డు దాటి హైదరాబాద్ వెళ్లేందుకు వేచి చూస్తుండగా అప్పటికే అక్కడికి వచ్చిన ప్రత్యేక పోలీస్ బృందం వారిని గుర్తించి దేవరకొండకు తీసుకువచ్చింది. తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ మందలిస్తారనే భయంతోనే పారిపోయామని, కల్లు ప్యాకెట్ల విషయంలో తమ ప్రమేయంలేదని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. 48గంటల్లోనే విద్యార్థుల ఆచూకీ తెలుసుకునేందుకు కృషిచేసిన దేవరకొండ సీఐ నర్సింహులు, కొండమల్లేపల్లి సీఐ ధనంజయ, దేవరకొండ ఎస్ఐ రమేష్‌తోపాటు డివిజన్ పరిధిలోని పోలీసులను జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. కల్లు ప్యాకెట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మైనార్టీ గురుకుల పాఠశాల జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ విష్ణుమూర్తి, దేవరకొండ సీఐ నర్సింహులు, గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హనుమంతు అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ అన్నెపు వెంకట్

మోత్కూరు, సెప్టెంబరు 19: మోత్కూరు సాయి చైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 18న నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి జూడో పోటీల్లో పలువురు విద్యార్థులు బంగారు పతకాలు గెలుచుకున్నారు. వివిధ విభాగాల్లో మోత్కూరుకు చెందిన ఎం.రమ్య, ఎస్.శ్రీజ, ఎం.సిరివెన్నెల, కె.అలేఖ్య, ఎన్.సాక్షి, ఆర్.విక్రాంత్ గోల్డ్ మెడల్స్ సాధించారు. నిధిచందన(గుండాల), కె.కిరణ్ (భువనగిరి), టి.రతన్, డి.భరత్, ఎం.మణికంఠ (బీబీనగర్), ఎం.మణి (వెంకిర్యాల), ఎం.శివ (నకిరేకల్) బంగారు పతకాలు సాధించారు. ఎం.విమలశ్రీ, కె.భృతిక, ఎ.శ్రీజ, కె.సిరి, ఎం.అక్షత, బి.శ్రీమాన్, ఇ.హేమంత్, ఎ.విశ్వసాయి తేజు, పి.సాత్విక్, బి.వరణ్, మనోహర్, జశ్వంత్ వెండి పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 25 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బాలకృష్ణ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నాగరాజు, మోత్కూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి, సాయిచైతన్య ప్రిన్సిపాల్ బి.రవీందర్‌రెడ్డి, కోచ్‌లు పి.బాలరాజు, అన్నెపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన నర్సింగ్‌భట్ల విద్యార్థి



నల్లగొండ రూరల్: వంగల్‌లో ఈ నెల 14 నుంచి హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో నల్లగొండ మండలంలోని నర్సింగ్‌భట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎడ్ల గోపిచంద్ సత్తా చాటాడని పాఠశాల హెచ్ఎం మారయ్య తెలిపారు. ఈ సందర్భంగా గోపిచంద్‌ని ఉపాధ్యాయులుతోపాటు గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు యాదయ్య, గోపాల్‌రెడ్డి, యాదగిరి, సైదులురావు పాల్గొన్నారు.

అమ్మనబోలులో ఇసుక దొంగలు

● వేలం వేసిన ఇసుక కుప్పలు మాయం ● పట్టుకుంది 250 ట్రిప్పులు... గుర్తించింది 100 ట్రిప్పులు... సేకరించింది 35 ట్రిప్పులే



అమ్మనబోలులో అధికారులు సీజ్ చేసిన ఇసుక కుప్పలు, ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)



నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో ఇసుక దొంగలుపడ్డారు. అమ్మనబోలు-పొడిచేడు గ్రామాల నడుమ ఉన్న మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఇసుకాసురులు రహస్యంగా కొన్నిచోట్ల డంప్ చేసి ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్పందించిన అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక కుప్పలు సైతం మాయం కావడం విచిత్రంగా ఉంది. పోలీసుల కేసు నమోదుతోపాటు రెవెన్యూ, భూగర్భవనరుల శాఖ అధికారులు సీజ్‌చేసి వేలం నిర్వహించిన ఇసుక నిల్వలకే రక్షణ కొరవడి రాత్రికి రాత్రే దోచుకెళ్లడం ఆశ్చర్యం కలిగించే విషయం. దీంతో ఇసుక కుప్పలను తరలించేందుకు వేలం హక్కు పొందిన సదరు కాంట్రాక్టర్ ఇసుక కుప్పల వద్దకు వెళ్లి చూసి నివ్వెరపోవాల్సి వచ్చింది. ఇది సంబంధిత అధికారులకు తెలిసే జరిగిందా? లేక తెలిసినా తేలిగ్గా తీసుకున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

250 ట్రాక్టర్ల ఇసుక సీజ్

అమ్మనబోలు మూసీ వాగు నుంచి వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకునేందుకు గ్రామానికి చెందిన కొందరు ఇసుకాసురులు సుమారు 200 నుంచి 250 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను వివిధ ప్రదేశాల్లో డంప్‌చేశారు. అధికారుల కళ్లు గప్పి ఇసుకను తరలించేందుకు అదును కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇసుకను అక్రమంగా డంప్ చేశారని అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అమ్మనబోలులో దాడులు జరిపి గ్రామంలోని పలు ప్రదేశాల్లో డంప్ చేసిన సుమారు 250 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేశారు.

క్యూబిక్ మీటరుకు రూ.600

సీజ్ చేసిన ఇసుక నిల్వల పరిమాణాన్ని మైనింగ్ శాఖ అంచనా వేసింది. అనంతరం మైనింగ్ శాఖ ఆధ్వర్యంలోనే లెక్కగట్టి క్యూబిక్ మీటర్‌కు రూ.600 చొప్పున వేలం ధర నిర్ణయించారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలను విక్రయించేందుకు ప్రచారం చేశారు. దీంతో చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన ఓ కాంట్రాక్టర్ మైనింగ్ శాఖ నిర్ణయించిన ధరకు ఇసుకను సేకరించుకునేందుకు ముందుకొచ్చాడు. కానీ అప్పటికే శాఖల మధ్య సమన్వయం కొరవడి, సీజ్ చేసినా రక్షణ లేని ఇసుక కుప్పల నుంచి గుర్తు తెలియని కొందరు సుమారు 100 ట్రాక్టర్ ట్రిప్పుల మేర దొంగ చాటుగా తరలించినట్లు గుర్తించారు. దీంతో అధికారుల సూచన మేరకు మిగిలిన ఇసుక నిల్వలను ట్రాక్టర్‌కు రూ.1800 చొప్పున మొత్తం 100 ట్రాక్టర్ల ఇసుకకు గాను రూ.1,80,000లను సాండ్ మేనేజ్‌మెంట్ సొసైటీ పేరిట డీడీ చెల్లించి ఇసుక తరలింపు హక్కును సదరు కాంట్రాక్టర్ పొందాడు.

ఇచ్చిన గడువు 10 రోజులే..

వేలం ద్వారా పొందిన హక్కు మేరకు ఇసుకను తరలించేందుకు వేలందారుకు అధికారులు కేవలం 10 రోజులే గడువు ఇచ్చారు. ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీలోగా 100 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను తరలించాలని, అదీ సెలవు రోజుల్లో కాకుండా పనిదినాల్లో మాత్రమే అందునా కార్యాలయ పనివేళల్లోనే అంటూ నిబంధన కూడా పెట్టారు. అయితే టెండర్‌దారుడు ఈ నెల 13 శుక్రవారం నాటికి మొత్తం 35 ట్రాక్టర్ల ఇసుకను మాత్రమే తరలించగలిగాడు. తిరిగి శనివారం, ఆదివారం రోజుల్లో వెళ్లి చూసే సరికి ఉన్న ఇసుక నిల్వలు కూడా మాయమవడంతో నివ్వెరపోవడం కాంట్రాక్టర్ వంతైంది.

ఇసుక ఇస్తారా? లేక డబ్బులు వాపసు ఇస్తారా?

ఇసుక తరలింపునకు ఇచ్చిన గడువు 18వ తేదీతో తీరిపోయింది. గుర్తించిన ఇసుక నిల్వలను అంచనా మేరకు చెల్లించిన డబ్బులకు సరిపడా ఇసుక కాంట్రాక్టర్‌కు లభించలేదు. ఇసుక దొంగలు పడటంతో కనీసం సగం కూడా తీసుకువెళ్లలేదు. దీంతో ఇప్పుడు వేలందారుకు మిగతా డబ్బుల మేరకు మూసీ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతిస్తారా? లేక చెల్లించిన డబ్బులు వాపసు ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది. అదే సమయంలో చోరీ అయిన ఇసుక నిల్వలను మాయమైన ఘటనపై అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

పోలీసు శాఖదే బాధ్యత

అమ్మనబోలులో వేలం వేసిన ఇసుక డంప్‌ల మాయంపై నార్కట్‌పల్లి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా వేలం వేసిన ఇసుక నిల్వల బాధ్యత పోలీస్ శాఖదేనన్నారు. వేలం నిర్వహించి పోలీస్ కస్టడీకి స్వాధీనపర్చామన్నారు. ఒకవేళ వేలం వేసిన ఇసుక కుప్పలను కూడా ఎవరైనా మాయం చేస్తే బాధ్యులను గుర్తించి చట్ట ప్రకారం శిక్షించే బాధ్యత కూడా వారిదేనన్నారు.

రాహుల్‌గాంధీపై బీజేపీ వ్యాఖ్యలు అర్థరహితం



బీజేపీ నాయకుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. భువనగిరిలో గురువారం బీజేపీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ నాయకులు క్షమాపణలు చెప్పని పక్షంలో కేంద్రమంత్రుల పర్యటనలు అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నోముల తరుణ్, శరత్, సురేష్, ఆర్య, యశ్వంత్, సాయి, సందీప్, మహేష్, శివ పాల్గొన్నారు.

'ప్రాసెసింగ్ అధికారులుగా గుర్తించాలి'

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 19: ఆరోగ్య మిత్రలను ప్రాసెసింగ్ అధికారులుగా గుర్తించాలని ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు మీసాల మహేష్, మొగులుగానీ కాటమయ్య కోరారు. కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. 60జీవో ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 17ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. రూ.13వేల వేతనం దాటక దుర్భర జీవితాలు గడుపుతున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్ట్ పద్ధతిలో కనీస వేతనం రూ.22,750 ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు సబిత, మహేందర్, బాలయ్య, సుమ, ఇందిరమ్మ, జ్యోతి, శ్రీను, శారద పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19: దివ్యాంగురాలిపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వంగ ప్రకాశ్, వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో భువనగిరిలో గురువారం నిరసన తెలిపారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016 ప్రకారం కేసు నమోదు చేసి బాధితురాలికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త లలిత, బొల్లేపల్లి స్వామి, శ్రీహరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 19: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, లేనిపక్షంలో విధులు బహిష్కరిస్తామని పంచాయతీ కార్మికుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం వినతిపత్రం అందజేశారు. 51జీవో ప్రకారం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి తపాలా బీమా పథకం ద్వారా రూ.10లక్షల బీమా అమలు చేయాలని సంబంధిత సర్క్యూలర్ జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, బండెల బిక్షం, ఈశ్వరయ్య, రెడ్డబోయిన అయిలయ్య, శంకర్ మాంద్ర శ్రీను, పాపయ్య, హనుమంతు, సువర్ణ, నర్సమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వలిగొండ, సెప్టెంబరు 19: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీవో నాగిరెడ్డి, అదనపు డీఆర్‌డీఓ సురేష్ సూచించారు. మండలంలోని రెడ్లరేపాక, టేకులసోమారంలో గ్రామంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాలతో ప్లాస్టింగ్ నిషేదం, తడిచెత్త, పొడిచెత్త డస్ట్‌బిన్ వాడకం, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారి శ్రీనివాస్, ఏపీఎం జానీ, ఏపీవో పరుశురాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులు సమాజాన్ని చైతన్యపర్చాలని మునిసిపల్ కమిషనర్ పి. రామాంజల్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం భువనగిరిలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. పాఠశాలల్లోని చెత్తను చెత్త సేకరణ సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, హెల్త్ అసిస్టెంట్ రజిత, సీవో సువర్ణ పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు, డీఏ విడుదల చేయాలి'

రాజాపేట, సెప్టెంబరు 19: పెండింగ్ బిల్లులు, డీఏ విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రాజాపేట, బొందుగుల పాఠశాలల్లో గురువారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి, వోపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ మండల కార్యదర్శి సత్యానంద్, నాయకులు పలుగుల రాజు, దూడుక జానయ్య, నామ్‌దేవ్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభిప్రాయాలు చెప్పాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 19: ఫొటో ఓటర్ల జాబితాను పరిశీలించి పార్టీల నాయకులు అభిప్రాయాలు చెప్పాలని ఎంపీడీవో రాపర్తి భాస్కర్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులుంటే లిఖిత పూర్వకంగా సూచనలు ఇవ్వాలని చెప్పారు.

భువనగిరి రూరల్: ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. వివిధ పార్టీల నాయకులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై అవగాహన కల్పించారు.

మోటకొండూరు: ఓటరు జాబితాపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎంపీడీవో ఇందిరా, తహసీల్దార్ శాంతిలాల్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఉందని తుది జాబితా 28వ తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

రాజాపేట: గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబిత తప్పుఒప్పులను తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, తహసీల్దార్ దామోదర్, ఎంపీవో ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తుది జాబితా ప్రదర్శన చేయనున్నట్లు ఎంపీడీవో కే. నవీన్‌కుమార్ తెలిపారు. యాదగిరిగుట్ట ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో డ్రాఫ్ట్, లిస్ట్ ఈ నెల 13న ప్రదర్శించినట్లు, విడుదలచేసిన ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే 21తేదీ వరకు చెప్పాలన్నారు. 28న తుది జాబితా ప్రదర్శించనున్నట్లు వివరించారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలి : చెరుపల్లి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: దేశఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కల్పించే జమిలి ఎన్నికలను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. భువనగిరిలో గురువారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరిట ప్రధాని మోదీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికను అమలు చేస్తే దేశ ఎన్నికల వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, దోనూరి నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, దయ్యాల నర్సింహ పాల్గొన్నారు.

ప్రధాని మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్ర మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో భువనగిరిలో గురువారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా 11ఏళ్లుగా పాలన అందిస్తున్నారన్నారు. 74మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, బీజేపీ సేవ మహా యజ్ఞం జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్‌రెడ్డి, బట్టు క్రాంతి కొక్కొండ లక్ష్మీనారాయణగౌడ్, చంద మహేందర్‌గుప్తా, ఊట్కూరి అశోక్‌గౌడ్, రత్నపురం బలరాం, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఆదమరిస్తే అంతే..



భువనగిరి పట్టణంలోని రహదారి వెంట రక్షణ ఏర్పాట్లు లేకుండానే ఉన్న వ్యవసాయ బావి

▸▸ ఇళ్ల మధ్య, రహదారుల పక్కన ప్రమాదకరంగా పాత బావులు



పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న పాత బావి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో పంటల సాగుకు బావులే ప్రధాన ఆధారంగా ఉండేవి. వ్యవసాయ బావులన్నీ జనావాసాలకు దూరంగా ఉండేవి. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ బావుల స్థానే బోరు బావులు రావడం, మరికొన్ని ప్రాంతాల్లో పంట పొలాలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. అయినప్పటికీ యజమానులు ఆ బావులను పూడ్చివేయడంలో చూపుతున్న నిర్లక్ష్యం చూపుతున్నారు. భువనగిరి పట్టణంలోని జనావాసాల మధ్య పదుల సంఖ్యలో వ్యవసాయ బావులు నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఏమరపాటుకు గురవుతే బావుల్లో పడిపోయే ప్రమాదం ఉంది. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోని చెత్తను నిరుపయోగబావుల్లో పారవేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఇళ్లు, రోడ్డును ఆనుకుని ఉన్న నిరుపయోగ బావులు స్థానికులను భయపెడుతున్నాయి. బావులను పూడ్చాలని కోరితే సంబంధిత యజమానులు గొడవకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదకర బావులను పూడ్చాలని, రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రమాదకరంగా ఉన్న నిరుపయోగ బావులను పూడ్చివేసేలా చర్యలు తీసుకుంటాం. సంబంధిత ప్రభుత్వ శాఖలకు లేఖలు రాస్తాం. యజమానుల ను గుర్తించి స్వచ్ఛందంగా పూడ్చివేసేలా కౌన్సిలింగ్ చేస్తాం. పూడ్చివేయకుంటే ప్రమాదాల నివారణకు రక్షణ గోడలు నిర్మించాలి. లేని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు పరిశీలిస్తాం.

\- మధుసూదన్‌రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

ప్రమాదకరంగా నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావులను పూడ్చేలా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, స్థానిక సంస్థలు ఎవరికి వారుగా నిరుపయోగ బావులను పూడ్చే విషయంలో, యజమానులకు నోటీసులు జారీ చేసి పూడ్చివేసేలా చర్యలు తీసుకోవడంతో అధికారులు నిరాసక్తి చూపుతున్నారు. బావుల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెళ్లాల్సింది అగ్నిమాపక, పోలీస్ శాఖలే. ఈ తరహాలో జిల్లాలో ఇప్పటి వరకు పలు ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక, పోలీస్ శాఖలు సకాలంలో స్పందించి బాధితులను సురక్షితంగా వెలుపలికి తీసుకువచ్చారు. దీంతో ప్రమాదాలను నివారించేందుకు నిరుపయోగంగా వ్యవసాయ బావులను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : కుంభం

వలిగొండ, సెప్టెంబరు 19: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధులతో కలిసి గురువారం వలిగొండలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పట్టణంలో సీసీ రోడ్లపైన మ్యాన్‌హోల్స్ సరిగా లేవని డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదని విద్యుత్ ఐరన్‌పోల్స్‌ను తొలగించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరల్లో నిర్మించబోయే నూతన పీహెచ్‌సీని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య భవనం కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలో పట్టణ ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు, వర్షాల కారణంగా మూసీ బ్రిడ్జిపై ఆగిన మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు గ్రంథాలయంలో మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో క్రీడాకారుల సౌకర్యార్థం మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ మన టీమ్ యూత్ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ మచ్చేందర్, ఎంపీవో కేదారి ఈశ్వర్, నాయకులు కుంభం విద్యాసాగర్‌రెడ్డి, వెంకటపాపిరెడ్డి, సత్తిరెడ్డి, కిష్టయ్య, శ్రీను, ఉపేందర్‌బోస్, లింగయ్య, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



వలిగొండలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సెక్యూరిటీగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 19: పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు దేవరకొండ బ్రాంచ్‌లో ఏటీఎం సెక్యూరిటీగార్డు గడ్డం యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి భూదాన్‌పోచంపల్లి పట్టణం లోని ప్రధాన కార్యాలయంలో చైర్మన్ తడక రమేష్ తోపాటు పాలకవర్గం, బ్యాంకు మేనేజర్లు సేకరించిన రూ.77వేలు ఆర్థిక సాహాయాన్ని గురువారం కుటుంబసభ్యులకు అందజేశారు. బ్యాంకులో వారి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను చైర్మన్ తడక రమేష్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్, వైస్‌చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు మేనేజర్లు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బ్యాంకు చైర్మన్ తడక రమేష్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గుండాల, సెప్టెంబరు 19: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాక్‌పాషాబేగం అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తినే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు నెలలో అన్ని రకాల కూరగాయలు, పండ్లు అందు బాటులో ఉంటాయని వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం అంజయ్య, సీసీలు భాస్కర్, కొమురయ్య, బాలనారాయణ, గీత, మండల సమైఖ్య అధ్యక్షురాలు సంతోష, యాదమ్మ ఉన్నారు.

భువనగిరి రూరల్: పోషణ లోపం ఉన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అదనపు పోషకాహారం ఇవ్వాలని మండల వైద్యాధికారి డాక్టర్ యామిని శృతి సూచించారు. మండలంలోని బొల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని నాగిరెడ్డిపల్లి, ఎర్రంబెల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారుల ఎత్తు, బరువును చూశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ తులసీ, సీహెచ్‌వోలు రమాదేవి, హరిదేవి, శోభ, సుమతి పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మహిళలు, పిల్లలు విధిగా పౌష్టికాహారం స్వీకరించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్స్ హారిక, శ్రీలత అన్నారు. గురువారం మండలంలోని మర్యాల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించి జాతీయ పోషణ మాసోత్సవంలో మాట్లాడారు. సమతుల్య ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. ఆటల పోటీల విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు ముభిత్, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 19: క్రీడలు శరీర దారుఢ్యానికి, మానసికోల్లాసా నానికి దోహదపడతాయని మండల నోడల్ అధికారి కె. మహదేవరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో మండలస్థాయి (ఎస్‌జీఎఫ్) పాఠ శాలల పోటీలను గురువారం ప్రారంభి మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 14, 17 సంవత్సరాల బాల బాలికలు 150 మంది విద్యార్థులు క్రీడలల్లో పాల్గొన్నారు. వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు నెలలో భువనగిరిలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలల్లో పాల్గొంటారని మండల క్రీడా ఇన్‌చార్జి జెట్ట రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఇందిరాప్రియ, నాగమల్లు, లక్ష్మణ్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల్లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలు నిర్వహించారు. విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు గౌటే లక్ష్మణ్, హెచ్ఎం జయంతి, చంద రమేష్, శశికుమార్, కోటిరెడ్డి, మంజుల, మధు, కృష్ణమూర్తి శోభారాణి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలి



సంస్థాన్‌నారాయణపురం: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు



యాదగిరిగుట్ట : పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన నాయకులను పోలీసులు జిల్లావ్యాప్తంగా గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఆలేరులో అరెస్ట్ అయిన వారిలో నాయకులు పుట్ట మల్లేశ్, గంగుల శ్రీను, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, గంపల విజయ్, తదితరులు ఉన్నారు. యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయినవారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, గడ్డం చంద్రం, ర్యాకల రాజు, బండి వాసు, దండోయిన వీరేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు. మోటకొండూరులో బీఆర్ఎస్ నాయకులు ఎగ్గిడి కృష్ణ, ఎండీ బురాన్, బొట్ల మహేష్, నల్ల జహంగీర్, వంగపల్లి నరేష్, బొట్ల నవీన్, బాలకృష్ణను ముందస్తుగా అరెస్టు చేసి పోలీ స్స్టేషన్‌కు తరలించారు. గుండాలలో అరెస్టు అయిన వారిలో మార్కెట్ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, నాయకులు రంజిత్ రెడ్డి, మాదరబోయిన శ్రీను, నాగెల్లి రమేష్, ఉస్మాన్, రాజు ఉన్నారు. వలిగొండలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో ఎండీ జానీ, అఫ్రోజ్, నరేష్‌రెడ్డి, మారయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు ముఖ్యులుగా ఉన్నారు. మోత్కూరు మండలంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్, కొనతం యాకూబ్‌రెడ్డి, కొండ సోమల్లు, అన్నందాసు విద్యాసాగర్, కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డి ఉన్నారు. అడ్డగూడూరులో అరెస్టయిన వారిలో మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కడారి సైదులు, నాగులపల్లి దేవగిరి, గూడేపు పరమేష్, గజ్జెల్లి రవి, గూడేపు నరేష్ ఉన్నారు. రాజాపేటలో అరెస్టు అయిన వారిలో తిరుమల్లేష్, గోపాల్, పల్లె సంతోష్, సందెల బాస్కర్, బెడిదే వీరేశం, జశ్వంత్, బిక్షపతి తదితరులు ఉన్నారు. ప్రజాభవన్ ముట్టడికి బయలు దేరిన తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, బీజేపీ రైతు విభాగం జిల్లా నాయకుడు బాస్కర్ నరసింహ, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భిక్షం, మన్నే చిత్రసేనారెడ్డి, చికిలమెట్ల ప్రభాకర్, సిలువేరు శంకర్ తదితరులను పోలీసులు సంస్థాన్‌నారాయణపురంలో అదుపులోకి తీసుకున్నారు.

ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన మహమ్మద్ ప్రవక్త

భువనగిరి టౌన్, సెప్టెంబరు 19: తన జననంతో మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇచ్చారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరిలో గురువారం నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో ఆయన మాట్లాడారు. అల్లా సందేశాన్ని మానవాళికి ప్రబోధించిన దివ్య పురుషుడు ప్రవక్త అని అన్నారు. మతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని ప్రవక్త సందేశాన్ని నేటితరం ఆచరించాలన్నారు. ఆయన బోధనలను అనుసరిస్తే అంతటా శాంతి నెలకొంటుందని. సన్మార్గంలో నడవడానికి దోహదపడతాయాన్నారు. యువత భక్తి గీతాలు ఆలపిస్తూ, జెండాలు ప్రదర్శిస్తూ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ కొనసాగింది. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జలీల్ పుర మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్‌చౌదరి, నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, కాజం అహ్మద్, గఫార్ చౌదరి, ముస్తఫాఖాద్రి, అమీరుద్దీన్, ఫకీల్, అజీముద్దీన్, సలావుద్దీన్, ఒలీ బాబా, సుజాయుద్దీన్, రఫీ యుద్దీన్, సాధి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాజాలుబాయికి నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

మోత్కూరు, రామన్నపేట, సెప్టెంబరు 19: బడుగు, బలహీన వర్గాల విద్యార్థినులకు విద్య, సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించిందుకు మోత్కూరు ఎస్సీ బాలికల వసతి గృహ సంక్షేమాధికారి డి. రాజాలుబాయికి జాతీయ ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ 'నేషనల్ ఎక్స్‌లెన్స్ బెస్ట్' అవార్డు అందించింది. హైదాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని గురువారం జరిగిన కార్యక్రమంలో హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆమెకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.



అవార్డు అందుకుంటున్న రాజాలుబాయి

సంక్షిప్త సమాచారం..

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పోచంపల్లి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు అన్నారు. పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అంకం పాండు, జాయింట్ సెక్రటరీ బిట్ల గణేష్‌లను పట్టణంలోని శ్రీరామ మార్కెట్ యాజమాన్యం గురువారం సన్మానించింది. కార్యక్రమంలో మెరుగ యతినందం, బడుగు మహేష్, చిలువేరు లక్ష్మణ్, చిక్క జయప్రకాష్, తడక శ్రీను, ఆడెపు రామేశ్వర్ పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: సబ్సిడీ గ్యాస్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుర్వంగ చందు కోరారు. మండలంలోని రామచంద్రాపురంలో మహాలక్ష్మి పథకం రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెంటయ్య, భువనగిరి ఉపేందర్‌గౌడ్, దొమ్మాటి ఉదయ్, కంసాని కృష్ణ, కొండోజు రోహిత్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని కొల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రేగల లింగం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు, నాయకులు తుంగ కుమార్, గాజుల వెంకటేష్, సురేష్, ఎజాస్ తదితరులు ఉన్నారు.

రామన్నపేట: కమ్యూనిస్టు ఉద్యమాలే దేశానికి దిక్సూచిగా ఉంటాయని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. మండలంలోని కక్కిరేణిలో సమావేశంలో మాట్లాడారు. సీపీఎం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు తరాల నర్సింహ, గన్నెబోయిన విజయభాస్కర్ నల్లమల్ల నర్సింహ, రాములు కృష్ణ, మహేందర్, శివబాలకృష్ణ, మర్రి అండాలు, పూలమ్మ, కావ్య, పద్మ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన గంజి మురళీ గుండెపోటుతో మృతిచెందాడు. అతనితో పాటు పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.80వేల విరాళాలు సేకరించి మురళి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాండాల శేఖర్‌గౌడ్, చీర సత్యనారాయణ, పక్కీరు శశిధర్‌రెడ్డి, ప్యారారం రాములు, సిలువేరు శ్రీనివాస్, బండ శ్రీశైలం, కోకలకొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్: యాదగిరికొండపైకి నడిపే ఆటో డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నాయకత్వంలో సలహాదారుడిగా తుమ్మల ఇస్తారి, అధ్యక్షుడిగా గుండు సాయిలు, ఉపాధ్యడుగా గడ్డమీది దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా గుండు సంతోష్, సభ్యులుగా గోరక నవీన్, ఏశమైన నాగరాజు, బాకీ మొగులయ్య, కంసాని శ్రీహరి ఎన్నికయ్యారు.

మోటకొండూరు: పేద విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని 50మంది విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరుపులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ డైరెక్టర్ తండ పాండు రంగయ్యగౌడ్, వార్డెన్ ఆనంద్, మాజీ జడ్పీటీసీ గంగాపురం మల్లేష్, కాంగ్రెస్ నాయకుడు భూమండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాల్ద రామకృష్ణ, సిద్దులు, భూమండ్ల అశోక్, ఇస్తారి, కొమురయ్య పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి కేర్చిపల్లి గణేష్ యూత్ సభ్యులు రూ.10వేల విలువైన పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చిన్నం వెంకటేష్, సభ్యులు అశోక్, కృష్ణ, మల్లేష్, రవి, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన నిరుపేద కుర్రె రాధమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కొంత కాలం క్రితం మృతి చెందింది. ఆమె కుమారుడు కూడా వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు, దాతలు అతనికి రూ.60వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కోమటి మత్స్యగిరి, బద్దం నాగార్జునరెడ్డి, మర్రి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజాపేట: రాజాపేట మండలం నుంచి మార్కెట్ కమిటీకి ఎన్నికైన డైరెక్టర్ చిలివేరు బాలరాజ్, మాడవత్ విఠల్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బూడిగే పెంటయ్య గౌడ్, నెమిలే మహేందర్‌గౌడ్, పాండవుల బస్వయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చిర్రగూడూరు గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి చిర్రగూడూరు గ్రామానికి చెందిన పర్రెపాటి విష్ణు, ముద్రబోయిన అజయ్ అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్.ఐ నాగరాజు తెలిపారు.

మోత్కూరు: 55 ఏళ్ల పైబడి 61ఏళ్ల లోపు ఉన్న వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ వీఆర్ఏలు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రాలు అందజేశారు. మోత్కూరు-గుండాల మండలాల మధ్య బిక్కేరు వాగు నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నందున దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మోత్కూరు పశువైద్యశాలకు ప్రహరీ నిర్మించాలని వెటర్నరీ ఏడీ మోతీలాల్ ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేశారు.

భువనగిరి అర్బన్: వార్డుల వారీగా ఓటర్ల విభజనలో అవకతవకలు జరిగాయని, ఓటర్ల జాబితా అశాస్త్రీయంగా రూపొందించారని వలిగొండ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కీసరి రాంరెడ్డి ఆరోపించారు. కలెక్టరేట్‌లో గ్రామస్థులతో కలిసి కలెక్టర్ హనుమంతు జెండగేకు వినతిపత్రం అందజేశారు.